# భజనతమాషా *ప్రహసనము

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

రాజేశ్వరి—భార్య.

రంగారావు—భర్త.

లలిత—కూతురు.

కృష్ణుడు—కొడుకు.

గోపాలరావు } స్నేహితులు.
నరసింహారావు }

అమ్మగారు భక్తురాలు.

## 1 వ రంగము

రంగారావు, రాజమ్మ.

రా: ఏమండీ ఒకమాటు వెళ్లివస్తా.

రం: ఎక్కడికి?

రా: రాధమ్మగారింటికి. యెవరో భక్తురాలు వచ్చిందటండీ. ఆమెకు భగవంతుడు ప్రత్యక్షమౌతాడట. ఊరంతా కోలాహలంగా చెప్పుకుంటున్నారు. ఇవ్వాళ శుక్రవారం. భజన చాలా బాగా వుంటుందట. పోయివస్తా.

రం: దేవుడేమిటి. ప్రత్యక్షంగావటమేమిటి? చాల్లే ఊరుకో. ఇదంతా వట్టి బూటకం.

రా: అయ్యో చూచివచ్చినవాళ్లు ప్రత్యక్షంగా చెప్తుంటే బూటకమంటారేమిటి?

రం: వేయేండ్లు తపస్సుచేసినా మహర్షులవంటివారికి దర్శనంగాలేదు. నానాపరాభవములు పడితేనేగాని ద్రౌపదిని రక్షించలేదు. 'ధైర్యం విలోలంబయ్యె'నని మొత్తుకున్నదాకా గజేంద్రుడికి మోక్షం లభించలేదు. తండ్రిచేత నానాపాట్లుపడి తలతెగేసంతపని అయితేనేగాని ప్రహ్లాదునివంటి భక్తశిఖామణికి భగవద్దర్శనప్రాప్తి గల్గలేదు. భగవంతుడంటే అల్లాటప్పాకాదు. మన శక్తియుక్తులన్నీ పరీక్షించి, పరీక్షించి మన భక్తిజ్ఞానవైరాగ్యాదులన్నీ, ఒఱిచి, ఒఱిచి, 'నీవేతప్ప నితఃపరంబెఱుంగ'నని బాసజేస్తే, 'అన్యథా శరణంనాస్తి' అని సర్వసమర్పణజేస్తే, అప్పటికీ యేమో—అవాఙ్మానసగోచరుడనికదా ఆ పరమాత్మకు పేరు.

---

* ఈ ప్రహసనము నాచే కొంత పెంచి ప్రదర్శనానుకూలముగా వ్రాయబడినను దీనికి మూలము శ్రీయుత మునిమాణిక్యం నరసింహారావుగారి 'మా ఆవిడెభజన' అను చిన్నకథ కావున వారికి నా కృతజ్ఞతాపూర్వక వందనములు తెలుపుచున్నాను.

రా: ఒక్కమాటకు యెంత లెక్కచేస్తారు? ఏమో ఎవరిభక్తి యెటువంటిదో! అందర్నీ వేలకొలది సంవత్సరాలే తపస్సు చేయవలెనా? ఖట్వాంగుడు రెండుగడియలలో ముక్తికిపోలేదూ! వారివారి పుణ్యవిశేషం బాగుంటే ఒక్కక్షణంలో పరమాత్మ అనుగ్రహింపవచ్చు. ఏపుట్టలో ఏపామున్నదో ఎవరు చూచొచ్చారు.

రం: అంత భక్తి తాత్పర్యాదులుంటె కావలసిందేమి.

రా: అవునదే నా కోరిక.

రం: సరే వెళ్లు.

## 2 వ రంగము

రంగారావు, రాజమ్మ, లలిత, కృష్ణుడు.

కృ, ల: నాన్నోయి. నేనూ అమ్మా అంతా భజనకువెళ్లి వచ్చాము.

రం: ఓ వెళ్లివచ్చారు! ఏంజేశారు?

కృ: పానకం, వడపప్పు, అరటిపండ్లు, కొబ్బరితురుము, వెన్నముద్దలు అన్నీ యిచ్చారు. బలే బాగుంది నాన్నా భజన.

రం: ఓ యిన్నివిధాల నోరు తియ్యబరిస్తే బాగుండకేమిరా భజన? నేనుగూడా వస్తే బాగుండేది.

కృ: మగవాళ్లు రాగూడదు నాన్నా భజనకు.

రం: మరి నీవెందుకు వెళ్లావు?

కృ: నేను చిన్నపిల్లవాడినిగా. నేనుపోతేనేం. నాన్నలు రాగూడదు.

రం: ఏం భజనకువెళ్లి వచ్చావు? ఏమాత్రం మూటగట్టుకొచ్చావు?

రా: మంచీలేదు, చెడూలేదు. అన్నిటికీ హాస్యమే. దేవుడి విషయంలో ఎగతాళీలేమిటి?.

రం: మీ దేవుణ్ణి నేను వెక్కిరించలేదు. పిల్లవాడేదో అవీ, యివీ తిన్నామంట్టూఉంటే, నాకేమన్నా మూట గట్టుకొచ్చావేమో తిందామని అడిగాను.

రా: ఆ, మీ చమత్కారాలు నాకు తెలియకపోలేదు.

రం: అయితే భజన కాలక్షేపమెట్లా ఉన్నది.

రా: బహుబాగా ఉన్నదండీ. నిజంగా భగవంతుడు అమ్మగారికి ప్రత్యక్షమండీ. నమ్మితారో లేదో కండ్లు మూసి అందరం భజనచేస్తూనేయున్నాము. ఎటునుంచి దయచేశాడో ఆ స్వామి వెన్నగిన్నెలో రెండు అడుగులు అద్దినట్లున్నాయి గిన్నెనిండాపెట్టిన పాలు సగానికున్నాయి.

రం: ఆ. యిదంతా నిజమేనంటావూ?

రా: కళ్లారాచూస్తే యింకా అబద్ధమేనంటారా?

రం: సరేకానీ రోజులు గడవనీ.

రా: ఏమండీ, ఆమెను మనయింటికొక శుక్రవారం పిలుచుకువచ్చి మన యింట్లో భజనచేయిస్తాను. నిజంగా అటువంటి భక్తురాలు మనయింటికొస్తే మన యిల్లు పావనమవుతుంది, మన జన్మ తరిస్తుంది, స్వామి హరనాథబాబావారు మన ప్రసాదం స్వీకరించి మనలను ధన్యుల్ని చేస్తారు.

రం: సరే, మొదలుపెట్టావు, నీవు భజనకెళ్లుతానంటే నాకిదే భయం. మనకెందుకీగోల? మనం అంత పుణ్యాత్ములము కావద్దూ, తీరా భజన మొదలుపెట్టాక ఆస్వామివారు ప్రసాదం స్వీకరించకపోయెనా మనం పుణ్యాత్ములము కాదంటారు. ఎందుకు చేయిచూచి అవలక్షణ మనిపించుకోడం? ఏపనైనా చేయి గాని ఈపనిమాత్రం తలబెట్టుకోబాక.

రా: అదేమిటండీ, అంతమాటంటారు, మనం పుణ్యాత్ములము కాకపోవడమేమిటి? మనకు స్వామివారి అనుగ్రహం కల్గకపోవడమేమిటి? దాని దుంపతెగ పదిమాట్లు పారిపోతే పట్టుకొచ్చినముండ ఆ భాగ్యమ్మకంటే చెడిపోయినామండీ. ఏదో పైకి వేదాంత విచారణలు భజనలు చేస్తుంటుందే గాని ఆ రాధమ్మగారికిమాత్రం ఏమంత మంచిపేరున్నది. అట్లాంటివాళ్లనందర్నీ హరనాథబాబా కరుణించి వారి యింటికి విజయంచేసి వారిచ్చిన పాలు, వెన్న, పంచకజ్జాయము స్వీకరిస్తూఉంటే పవిత్రమైన సంసారులం మన యింటికి స్వామి రాకుండా ఉంటారా? ,

రం: హరనాథబాబా అటువంటి పతితోద్ధరణకే పూనుకొన్నాడేమో, మనవంటివాళ్లను ఆయన అనుగ్రహించడేమో.

రా: ముందు అదుగో అపశకునాలు పలకబోకండీ.

రం: అయితే భక్తురాలంటే నొక్కులు నొక్కులుగా ఉన్న నల్లని వెంట్రుకలు జారుముడివేసుకొని సన్నని మృదువైన కాషాయవస్త్రం కట్టుకొని మెళ్లో యేదో పూసల తావళంవేసుకొని రాధమ్మగారి సావిట్లో కూర్చుండియున్నది ఆమేనా యేమిటి?

రా: ఆ, ఆమే అమ్మగారు. మీరెప్పుడో విశదంగా చూచారే, అమ్మో ఏమి ఎరగనట్టుంటారు గాని మీరెక్కడ?

రం: పరమ భాగవతురాలని మీ ఆడంగులంతా ఆమెను అఖండంగా సత్కరించి పవిత్రులౌతుంటే మేము చూచైనా తరించవద్దూ.

రా: ఆమె ఒకచేత సితారు ఒకచేత చిరతలు పుచ్చుకొని సన్నని కంఠముతో మనోహరంగా పాడుతూ భక్తి పారవశ్యంచేత జుట్టుముడి వీడిపోయి నృత్యంచేస్తుంటే అపరరాధే అని అనిపిస్తుందండీ. నిజంగా భక్తి ఉట్టిపడుతూ ఉంటుందండీ. ఆ ముఖంలో నేను వెట్టిదాన్నై ఆమెను మెచ్చుకొంటున్నాననుకుంటున్నారా.

రం: మొన్న రాధాకృష్ణ నాటకంలో మా స్నేహితుడు గోపాలరావు రాధపాత్ర నెంతో మనోహరంగా అభినయించాడు దానికేమిలే.

రా: భక్తులను దూషించకండి పాపం వస్తుంది. అయితే రేపు శుక్రవారం అమ్మగారిని మనయింటికాహ్వానిస్తాను.

రం: నీ యిష్టం.

## 3 వ రంగము

భజన స్త్రీలు పిల్లలు పాటలుపాడుతూ ఉంటారు. హరనాథబాబాకీ జయ్, కుసుమకుమారికీ జయ్, కృష్ణపరమాత్మకు జయ్, రాధామాయీకీ జయ్ అని పిల్లలు అరుస్తూ ఉండగ రంగారావు ప్రవేశము.

కృ: నాన్నా, యివ్వాళ మనయింట్లో భజనచేశారు.

ల: అమ్మో ఆ భజనచేసే ఆమెకే...

రం: ఆ, యేమైనా యిచ్చిందా ఏమిట్రా?

రా: ఏమి యివ్వలేదు మీరు గాభరాపడబోకండి, పోండి అల్లరి సన్నాసుల్లారా (అని పిల్లలను తరుముతుంది)

లలిత: (దూరంగాపోయి) ఆ, యేమీ యివ్వలేదూ నీ చేతిఉంగరం తీసియిస్తివే.

రం: ఏమిటీ రాజేశ్వరీ! నీకు మతిపోయిందా యేమిటి? ఈ రోజుల్లో బంగారం యెంత ప్రియమో తెలుసా. చూస్తూ యిరువైరూపాయల ఉంగరం యెందుకు బుట్టినట్టు.

రా: పెద్దలకిచ్చినది లెక్క చూచుకోగూడదు. అటువంటి మహాత్ములకు మనసొమ్ము చెందితే పూరుకోరు. పదింతలు సమకూడేటట్లు చేస్తారు.

రం: బాగానే యున్నది నీ అంధవిశ్వాసం. అమ్మగారు తృణం స్వీకరించదన్నావు ఇదేమిటి?

రా: సరే వూరుకోండి. ఆమె మనలను యివ్వమని అడిగిందా యేమిటి. మన తరుణోపాయంకోరకు మనము.

రం: మన తరుణోపాయంగాదు, వారి తరుణోపాయం అను.

రా: అబ్బా మీరిట్లు అంటారనే మావాళ్లిచ్చిన ఉంగరం యిచ్చాను, అయినా మీరు వదలకుండా ఉన్నారే.

రం: మీవాళ్లిచ్చింది స్త్రీమాత్రం నాకు దండగగాదూ ఇది యెవరికో దానంచేశాను మళ్లీ క్రొత్తది చేయించుక రమ్మంటే చేయించవద్దూ నేను.

రా: అబ్బా మీరు చేయించవద్దుగాని పదేపదే పెద్దలకిచ్చింది లెక్కపెట్టకండి. యిచ్చిన ఫలంకూడా ఉండదు.

రం: ఏడిసినట్టే ఉంది తెలివి.

## 4 వ రంగము

నరసింహారావు, గోపాలరావు, రంగారావు.

న: ఒరేయ్, మీ ఆవిడకూడా భక్తసమూహంలో చేరిందిటే! ఏమిటి విశేషాలు? మీ యింట్లోగూడా యేమైనా దాఖలాలు కనుపిస్తున్నాయా?

రం: నాలుగువారాలనుంచీ చేస్తున్నాము యింతవరకు యేమీ లేవు.

గో: ఏమిటిరా ఈ ఆడవాళ్లకీపిచ్చి, యిదంతా నిజమేనంటావా?

రం: నాకు యేమి అనడానికి తోచడంలేదు.

న: ఆ, యేమున్నది. ఆడవాళ్ల మూఢత్వమే యిన్నిటికి కారణం. కొన్నాళ్లు యెద్దుకు మ్రొక్కారు, కొన్నాళ్లు చెదలుపుట్టలు సేవించారు, కొన్నాళ్లు పాము భగవంతుడన్నారు, కొన్నాళ్లు పిల్లి దేవుడన్నారు,

కొన్నాళ్లు రామభజనలు, కొన్నాళ్లు పండరిభజనలు, కొన్నాళ్లు పరమహంస భజనలు, ఇప్పుడు మెహెరనాధబాబా భజనలు వచ్చినాయి. కాషాయగుడ్డకట్టినవారల్లా, తులసీ రుద్రాక్షపేర్లు వేసినవారల్లా, బవిరిగడ్డాలు పెంచినవారల్లా మహాత్ములౌతారుట్రా. వాళ్ల అంతశ్శుద్ధియేమో తెలుసుకోకుండా వాళ్ల శీలమర్యాదలేమో తెలుసుకోకుండా ఈ ఆడవాళ్లంతా యేదో తదంగం పెట్టుకొనివచ్చినవారినెల్లా యీ కొలవడమేమిటి.

రం: ఏమిటో అజ్ఞానపువాళ్లకు యెంతచెప్తే నేమున్నది. నేను మా ఆవిడకు యెన్నివిధాలో చెప్పా. ఎంత చెప్పినా ఆవిడ మతి తిరుగలేదు. ఏంజేయను, ఏదో భగవద్విషయంగదా యీ విషయంలోగూడా ఆవిడ మనస్సు నొప్పించడమెందుకని వూరుకున్నా. నాలుగువారాలు చేస్తే ఆ బులుపు తీరుతుంది. తరవాత అదే చప్పబడుతుంది.

గో: అదుగో, ఆ, ఉపేక్ష వాళ్ల అజ్ఞానం తొలగకుండా చేస్తున్నది. నూటికిద్దరికైనా చదువనేదిలేదుగదా. దేశపరిస్థితులు యెఱుగరుగదా. యితరదేశాల్లో స్త్రీలు యెంతెంత ఘనకార్యాలు చేస్తున్నారో గ్రహించరుగదా. ఏకపటబైరాగో యే దొంగభక్తురాలో వచ్చి యేదో తంతు తలపెడ్తే వెఱ్ఱెత్తినట్లు శివంపూనినట్లు, పుణ్యాం పుణ్యాం అంటూ వాళ్లవెంట మూగడమా? కాస్తో కూస్తోవదలించుకోడమా, భక్తి అంటే బాహ్యాడంబరమా? భగవంతుడంటే ఐంద్రజాలికుడా? ఏ స్త్రీనైనా నిలవదీసి అడుగు. వీనినిగురించి యేమి కనుకున్నరో తెలుస్తుంది. అదిగో నేజెప్పితినే మన ఉపేక్షవల్లనే వారి అజ్ఞానం యేనాటికీ తొలగకుండా ఉన్నది.

రం: ఉపేక్షించక యేమిచేయమంటావు చెప్పు. ఇక యింట్లో జగడాలా?

న: ఇవన్నీ ఆడంబరాలనీ, నిజమైన భక్తికిదింత అట్టహాసం అక్కరలేదనీ, మంచినడవడీ, అనన్యమైన యేకాంత సేవ యిదే నిజమైన భక్తి అనీ పరార్థమైన లోకసేవంతా ఈశ్వరసేవేననీ, ఇదే సాత్వికపూజనీ, వారికి నచ్చచెప్పాలె. మా ఆవిడగూడా వెళ్లుతానని యిట్లాగే ఉద్రట్లూగితే యిట్లాగే నచ్చచెప్పాను. అంతటితో ఆమె ఆ ప్రయత్నం మానుకున్నది. ఏదో దేవుడి విషయమని వదిలిపెడ్తే అజ్ఞానులైన యీ ఆడవాళ్లు మూఢనమ్మకాల్లో పడి వున్నవివేకంగూడా ఊడగొట్టుకుంటారు.

రం: మీ ఆవిడకు వివేకం ఉన్నదికాబోలు ఊడకొట్టుకుంటుందని భయంతో జాగ్రత్తపడ్డావు. మా ఆవిడ కున్నదీలేదు, పోయ్యేదీలేదు.

గో: ఏమి యింత చీకటిపడి కచ్చేరినుండి వెళ్లుతున్నావు?

రం: యివ్వాళ శుక్రవారంగాదూ. భజనల గంద్రగోళం యింటినిండా ఆడవాళ్లుంటారని అట్లా కచ్చేరీనుండి షికారుబోయి వస్తున్నాను.

న: సరే, పోదాంపద.

## 5 వ రంగము

రంగారావు, రాజేశ్వరి, పిల్లలు.

రం: ఏమి రాజేశ్వరీ! యివ్వాళనైనా స్వామివారు దయచేసి పాలూ, వెన్నా ఆరగించిపోయినారా, కర్పూరపుబిళ్లలేమైనా పడ్డాయా, ఏమి అట్లా ఉన్నావేం, ఉత్సాహంగా లేవేం, స్వామి యేమీ దాఖలా

## భజనతమాషా ప్రహసనము

లివ్వలేదనేనా, ఇంత ప్రొద్దుపోయింది, ఇప్పుడు పొయ్యిలో నిప్పేస్తున్నావు. యింతదాకా భజనేనా, నానాటికి సక్కుబాయివై పోతున్నావే.

రా: (చేతులు నలుపుకుంటూ) క్రిందచూస్తూ మాట్లాడడు.

రం: ఏం జరిగిందిరా కృష్ణా?

కృ: ఏం జరగలేదు నాన్నా. భజనచేశారు మా కందరికి పంచదారా, కొబ్బరితురుము, వడపప్పు దోసెడు దోసెడు పెట్టారు.

రం: నీ తిండిసంగతెవరడిగారిప్పుడు. ఏమే అమ్మాయి?

ల: అమ్మ యిక్కడ స్వామివారి మెడలో వేసిందట కనప......(తల్లివంకచూచి ఊరుకుంటుంది)

రం: ఏమిటి చెప్పవు? మూతిముడుచుకు కూర్చున్నావు.

రా: గోవర్ధనగొలుసండీ, హరనాథుడికి వేశాను, కనిపించలే?

రం: ఆ, ఆ, గోవర్ధనగొలుసే, అయిదు సవరనుల గొలుసు అధ్వాన్నమైపోయిందీ!

రా: అధ్వాన్నం గావటమేమిటి.

రం: అధ్వాన్నంగాక మరేమైయింది?

రా: స్వామీ హరనాథబాబా తీసుకపోయినారు.

రం: చాలుచాలు కట్టిపెట్టు. నీ తెలివితక్కువ మతీ మతీ మితిమీరిపోతున్నదే. దేవుడేమిటి బంగారుగొలుసు తీసుకపోవడమేమిటి?

రా: అయితే ఏమైందంటారు?

రం: తాళం చేతులతోబాటు యెవరు బొడ్లో దోపుకుపోయారో.

రా: హరి హరి అంతమాటనబోకండి. ఒకరంగాదు. యిద్దరంగాదు, చిన్నా పెద్దా యిరువై ముప్పైమంది అక్కడ కూర్చుండి ఉండగానే.

రం: అయితే ఆ గొలుసు చివరిదాకా స్వామివారి మెడలో ఉన్నదా.

రా: ఏమో పైన పూలదండలు వేస్తిమి, అందరం కండ్లుమూసుకొని భజన చేస్తూఉంటిమి.

రం: ఏడిసినట్టే ఉన్నది. యింటినిండా పరాయివాళ్లు వచ్చి కూర్చుంటే నీవు కళ్లుమూసుకొని కూర్చోడమా.

రా: అందరు అట్లాగే కూర్చున్నారు.

రం: అందరు కూర్చుంటే కూర్చున్నారు. యింటిదానవు నీవు కళ్లుదెఱచి కూర్చోనక్కరలేదా.

రా: స్వామివారనుగ్రహించి పరిగ్రహించినదానిని ఆనందంతో ఆమోదించి వూరుకోవలయును గాని వ్యసనపడగూడదు.

రం: (కోపముతో) చాలు చాలు నీ తెలివితక్కువ నాకుకూడా కట్టిపెట్టబోకు. బంగారుగొల్సేమిటి, భగవంతుడెత్తుకపోవడమేమి!?? వెనుక ఆ శ్రీ కృష్ణపరమాత్మేనా ఆ వ్రేపల్లెవాడలో పాలు, వెన్న అపహరించాడని చెప్పారుగాని యిట్లా వెండిగిన్నెలు బంగారుగొలుసులు యెత్తుకపోయినాడని వినలేదే? ఇదేదో మాయగా ఉన్నదే. ఇదుగో ఇదే చెప్తున్నా. ఈవిధంగా కొంపలో ఉండే గిన్నే గిట్రా

నగా నట్రా పొయ్యేటట్లైతే మన యింట్లో భజనలు చేయడానికి వీలులేదు. భగవంతుడన్న వాడు మనకేదో అనుగ్రహించేటట్టు ఉండాలె గాని మనకు ఉన్నదీ మన్నదీ దోచుకపొయ్యేటట్లైతే నేను భరించలేను. అయినా మీ ఆడవాళ్లకంతా వేలంవెర్రైపోయింది. ఏదో యింత భగవన్నామస్మరణ చేసుకుంటారు. దీనికికూడా కాదనడమెందుకని వూరుకుంటే కొంపలో వస్తువులు పోవడమా, ఎందుకీగోల. ఆ అమ్మగారెవరో దర్శించి నేనే మనవిచేస్తాను. అమ్మా యిటువంటి భజనలైతే మేము భరించలేము. మేమూ పిల్లలగలవాండ్లము. ఇట్లా నగా నట్రా పోతే మళ్లీ యేర్పరుచుకోలేము. నీవెక్కడికైన దయచేయమ్మా అని చెప్పివస్తాను.

రా: ఆమెగారు రాత్రికెట్లాగో వూరికి వెళ్లుతునే ఉన్నారు.

రం: ఇక నేమి పూర్తిఅయింది కాబోలు వసూలు.

రా: రామ, రామ, పెద్దలను దూషిస్తే (చెంపలు వేసుకొని) పాపంవస్తుంది. స్వామి హరనాథా మా పాపాలు క్షమించు స్వామీ.

రం: (కోపంతో గుడ్లెఱ్ఱజేసి) నోరుముయ్యి. ఆ బాబా పేరెత్తావంటే వెన్ను పగలేస్తాను. ఆ హరనాథబాబా సత్యంగల దేవుడైతే నా నూరురూపాయల గొలుసు అక్కడ పెట్టమను.

రా: (నమస్కారంచేస్తూ తలవంచి వూరుకుంటుంది.)

# ఆశీస్సు

శ్రీరామా కుచకుంభరాజిత మద శ్రీమాధురీ గంధక
స్తూరీ పూరిత వక్షభాగనట దస్తోకప్రభామండ వి
స్ఫారకౌస్తుభరత్నభూషణుఁడు కాపాడున్నినున్ సంతత
స్మేరాంకూరవిభాసితోష్ఠి! 'గృహలక్ష్మి' పత్రికా పుత్రికా!

భవ్యప్రఫుల్ల భావప్రపూర్ణ ప్రమదప్రదహృద్య పద్యములతోడ;
సంగీత సాహిత్య శాస్త్రార్థ సాంగత్య సమ్మతవ్యాసరాజములతోడ;
గృహిణీమణివ్రజ స్పృహణీయ రమణీయ నీతిదాయక కథా నియతితోడ;
సత్కళానైపుణ్య సంశోభితాదర్శకాంగనా సంఘ చిత్రాళితోడ;

హైందవస్త్రీలకెల్ల మహావిశేషములను బోధింప, నవ్వులు ముద్దులొల్క,
స్వర్గముననుండియే దిగివచ్చినట్లు చెలఁగు గృహలక్ష్మిరో! మదాశీస్సుఁ గొనుము!

ఇల్లాండ్రకెల్ల నుల్లము ఉల్లాసంబునఁ జెలంగ నుచితమగు కథల్
అల్లుచు, నందించుచు, వర్ధిల్లుచు, నిరతంబు మనఁగదే గృహలక్ష్మీ!

—శ్రీ ఎక్కల వీరరాజు.

# నిజానికి కవి యెవరు?

శ్రీమతి వేమగంటి పాపాయమ్మగారు

సామంత, మంత్రి, పురోహిత, కవి, గాయక వైతాళిక ప్రభృతులతోడను, సుహృజ్జనానీకముతోడను రాజసభ కిటకిటలాడుచుండెను. ఎల్లరు నుచితాసనములనుపవిష్టులైరి. నూతనాగతుడగు కవి కవిత్వమును విననందఱు కౌతూహలమానమానసులై రాజురాక కెదురుచూచుచుండిరి. సౌమ్య వినమ్రభావమున నిరువది సంవత్సరముల సుందరయువకుడు సింహాసనమున కొకయెడ నిలిచియుండెను. మధ్య వయస్కుడగు నాస్థాన కవి యుచితాసనమున గూరుచుండి, మధ్యమధ్య యువకునిదెస కొక తీక్ష్ణదృష్టి బరపుచువచ్చెను. ఆతని వదనమున వ్యంగ్యపూర్ణమృదుహాసరేఖలు పర్విడుచుండెను.

రాజసింహాసనపు వెనుకతట్టుననున్న మొఖమల్ పట్టుతెర తొలగెను. చోబుదారు లిరువురువెండి కఱ్ఱల హస్తములదాల్చి సింహాసనమున కిరువైపుల నిల్చిరి. మహారాజాగమనము సూచితమయ్యెను. ప్రజలందఱు కలకలముమాని సర్దుకొని కూర్చుండిరి. ఒకసారి యెల్లెడల నిశ్శబ్దత నివ్వటిల్లెను.

మరల తెర తొలగినది. ముప్పదిసంవత్సరముల సుందరపురుషుడు సింహాసనముదగ్గరకు మందగమనమున రాజఠీవి మెఱయ రాసాగెను. ధగధగాయమాన వస్త్రములు, వజ్రవైడూర్య స్థాపిత భూషణములు నాతని కెంతయు శోభ గూర్చుచుండెను. అతడే మహారాజు. సభాచారానుసారముగ నెల్లరులేచి, జోహారు లర్పించిరి. మహారాజు ప్రణామములకు బ్రతిగా శిరఃకంపనమొనర్చి, ఠీవిమెఱయ గద్దెపై విరాజమానుడయ్యెను.

సింహాసనమునకు కుడివైపున నొక వృద్ధసజ్జనుడు కూరుచుండియుండెను. ఆతని యాననమున ననుభవశీలత, విద్వత్తత ప్రకటములగుచుండెను. కొలది సేపటివరకు నెవరును మాటాడలేదు. మహారాజావృద్ధునితో నేదో మందస్వరమున నుడివెను. ఆవృద్ధుడు మంత్రి. అతడులేచి యువకునిదెస వీక్షించి, 'మోహనలాల్' అని పిలిచెను. యువకుడులేచి 'ప్రభూ!' అనెను. 'మహారాజుగారు నిన్ను వీక్షింపగోరుచున్నారు. ఎదుటికి రమ్ము.' అనెను మంత్రి. యువకుడు తన కట్టిన పుట్టముల సవరించుకొని, వినయనిర్భరభావమున నెమ్మదినెమ్మదిగా సింహాసనాభిముఖుడై చనెను. ప్రభువునకు ప్రణామమొనర్చి, వినయవిధేయతలతో చేతులు జోడించి, నిలువబడెను. మహారాజొకమారు విమర్శనాదృష్టితో నఖశిఖపర్యంతము విలోకించి, మోమున నానందరేఖలు విరాజిల్ల, 'ఈ యువకునిగాంచి చాల సంతుష్టుడనైతిని. మోహన్‌లాల్! నీవొక సత్కవివని వినుటకెంతయు సంతసమైనది. మంచిది. ఏదీ నీరచన మాకు వినిపింపు' మనెను.

మోహనుడేమియు సమాధానమొసగలేదు. ఆతడు జేబులోనుండి నెమ్మదిగా, గంభీరముగా నొకచిన్ని పొత్తమును వెలుపరించెను. వ్రేళులుకొలదిగ కంపింపజొచ్చినవి. పుస్తకమును విప్పెను. ఒక వీక్షణము రాజకవి దెసబరపి, తన కవనము విన్పింపమొదలిడెను. ఆతడు మందస్వరమున చదువసాగెను. క్రమక్రమముగా నాతనిస్వరము గంభీరమును, ఉన్నతమునయ్యెను. కవిత్వభావములతో నిమ్నోన్నతులనందెను. కరములు చలింపజొచ్చెను. తన్నుతామరచిపోయెను. బాహ్యప్రపంచమునే విస్మరించెను. సమర్థుడగు నొక యేలికయెదుట నుంటిననియే మరచెను. గొప్ప బిరుదుమగలగు ప్రభువులు, ధనవంతులు, పండితులు, నుద్యోగులు తనచుట్టు నున్నారనియే యెరుగడు. మంత్రముగ్ధులవలె నెల్లరు నాతని కవిత్వమును వినుచుండిరి. ఆ స్థానకవియు నాతని దదేకదృష్టితో జూచుచు, నేకాగ్రభావమున నాతని కవిత్వాకర్షణమున తల్లీనుడైపోయెను. కవిత్వము

ముగిసినది. యువకకవికి తన పరిస్థితిజ్ఞానము కలిగినది. అతఁడు పునఃవినయ గాంభీర్యములు దాల్చెను. ఇటు శ్రోతల నిద్రమబ్బును విడిపోయెను.

సభాసదులందఱు 'ఆహాహా! శేభాష్!' అని బాలకవి నుగ్గడింపజొచ్చిరి. మహీపాలుడును కవిత్వము చాల మనోహరముగను, మధురముగనున్నదని పొగడెను. ఇందలి ప్రశంసావాక్యములును యువకుని వదనమున కించిన్మాత్రమైన ప్రసన్నతాగర్వముల గొనిరాజాలకపోయెను. కవిమోము యథాపూర్వకముగా గంభీరముగను, కల్పనాశూన్యముగనుండెను. ఆస్థాన కవిచంద్రుడును శిరమువంచి నిశ్శబ్దముగ గూరుచుండెను. అతని నోటినుండి యువకుని కవిత్వవిషయమై యొక ప్రశంసావాక్యమైన వెలువడనేలేదు. ఆకస్మికముగా భూపతి రాజకవినిచూచి, 'చెప్పుడు, కవీశ్వరా! ఈ యువకుని కవనమెట్లున్న'దని ప్రశ్నించెను. కవి తల పైకెత్తి యొకనిమేషమేదియో యోచించి, 'కవిత్వమంత చెడ్డదికా'దని సమాధాన మిచ్చెను.

మహారాజు వదనమున నొక లేజిరునగవు ద్యోతకమయ్యెను. ఇతరసభ్యులును కవీశ్వరుని ప్రత్యుత్తరమునకు మందహాసమొనర్చిరి. అందరు గుసగుసలాడజొచ్చిరి. రాజకవి మండిపడుచున్నాడని యొకడును, రాజసమక్షమున నన్యునెట్లు ప్రశంసించునని యొకడును, అతడు పొగడకుండుట కీర్ష్యదక్క వేరేమున్నదని యొకడు నీవిధముగా భిన్నభిన్నములుగా గుసగుసలాడజొచ్చిరి.

కాని, మోహన్‌లాల్ రాజకవి వాక్యములు వినగానే వికాసమునందెను. చిరపరిశ్రమకు ఫలితము దక్కినదని యాతడెంతయు సంతుష్టాంతరంగుడై యొక దీర్ఘనిశ్వాసము విడిచెను. మహారాజునకు ప్రణమిల్లి మెల్లమెల్లగా తనస్థానమున విశ్రమించెను.

౨

ఆస్థానకవి పండిత చండీప్రసాదప్రవీణుడు కావ్యచూడామణి తనభవనమున గూర్చుండెను. భోజన సమయమైనది. కాని, యాతడేమియో విచారమున మునిగిపోయెను. భోజనమొనర్పవలెనను స్మృతియే యాతని కున్నట్లు కాన్పింపదు. అప్పుడాతని కుమారుడు, పదునెనిమిది వత్సరముల ప్రాయమువాడు. తండ్రికడకువచ్చి 'నాన్నగారూ! లేవండి భోజనానికి' అన్నాడు.

'నేడు నేను భోజనముచేయను'.

'ఏఁ?'

'నా కాకలిలేదు'.

'ఏమి? ఒంట్లో బాగాలేదా?'

'కాదు. ఏమో! ఆకలిలేదు'.

పుత్రుడు వెడలిపోయెను. వెంటనే. యాతనిభార్య వచ్చినది.

'ఏమండీ! భోజనముచేయనన్నారుటయేం?' అన్నది.

ప్రవీణుడు నిట్టూర్చి, 'ఏమని చెప్పను!' అన్నాడు.

'సంగతేమిటో చెప్పుదురూ'

'నేడొక కుఱ్ఱవానిముందు మహారాజు నన్నవమానపరచినాడు'

'ఎట్లు?'

# నిజానికి కవి యెవరు ?

‘ఒక యువకకవి యెటనుండియో వచ్చిపడినాడు. అతడు తనకవిత్వమును మహారాజునకు విన్పించెను. రచన మంచిదే. కాని రాజిచ్చిన బహూకృతిమాత్ర మనుచితము ’.

‘ఇంతకీ యతని యదృష్టము ! ఇందులో మీ కవమానమేమున్నది ?’

‘నీకేమి తెలియును ? నాకు దుర్భరావమానమే జరిగినది. నేనెంతెంతో రచనలు వ్రాసితిని. అందు నాహృదయమెల్ల నుంచితిని. కాని రాజింత బహుమానమెన్నడు నీయలేదు. దీనితో సరిపోయినదా ? ఆతని కాస్థాన కవీశ్వరోద్యోగమిచ్చి సత్కరించినాడు. తనకు సన్నిహిత మొనర్చుకొనినాడు ’.

‘పోనీలెండి ! ఇంతమాత్రమున మీయైశ్వర్యము కించిత్తైన నాతడు తీసికోలేదుగదా !’

‘ఆడవాళ్లకు ఈ విషయాలు తెలియవు. ఒక్కరచనకే యాతనికింత వైభవము కలిగినది. ఉచితానుచిత జ్ఞానము వీడి ధా జాతనిని నాయెదుటనే యింతసన్మానము చేసినపుడు, భవితవ్య మెట్లున్నదో యెవ్వరెరుగుదురు ?’

‘ఎప్పుడో యేదో రానున్నదని యిప్పటినుండియు మన సేల పాడుచేసికోవలయును ; పదండి - భోజనానికి లేవండి.’

‘ఏంభోజనము పోదూ ! - ఈ అసమర్థుడగు అంబికాప్రసాదుడు (కొడుకు) ఏనాటికేనాపనికివస్తేనా తర్వాత రాజకవికాగలడని యాశించితిని. ఇపుడు నాయనంతరము వరకెందుకు ? నేనుండగానే యన్యవ్యక్తి యొకడు నాస్థాన మాక్రమించినాడు. ఇంతకంటె దౌర్భాగ్యమింకేమున్నది ;’

‘ఇపుడు మనప్రసాదు మంచి, సరళకవిత్వము వ్రాయనేర్చినాడని మీరేకాదా ఆమధ్యనన్నారు ?’

‘నిరంతరకృషిచేసిన ఫలించును. కాని వాని కందుమనసే లేదు.’

‘ఇపుడు వాని వయస్సెంత ? కుఱ్ఱవాడు - పెద్దవాడయినకొలది కావలసినంత మనస్సుంచి కృషి చేయగలడు.’

‘అప్పుడే యెక్కడ పెద్దవాడగుట ? 25 సంవత్సరాలైనా రావలె.’

‘ఏడు సంవత్సరాలనాటికి పరిపూర్ణుడు కాలేక పోతాడా ; ఏడుసంవత్సరములకు యుగమే మారి పోవును.’

‘యుగము కాదు - రాయి తలక్రిందై పోవును. ఇప్పటినుండి ప్రయత్నము చేయలేకపోయిన ఏడు సంవత్సరములకు గాదు - పదునాల్గువత్సరాలకైనా వాడిట్లే యుండగలడు’

‘సరేలెండి ! ఇప్పటికీమాటలు విడవండి - భోజనానికి పదండి. భవిష్యత్తునకు విచారిస్తే ప్రయోజనమేమిటి ? ఎవరియోగమూ ఎవరూ హరించలేరు.’

ఏలాగుననైననేమి, ఆమెయాతని బ్రతిమాలి యోదార్చి భుజింపజేసినది. భోజనానంతరము ప్రవీణుడు కావ్యరచన మొదలిడెను. ఎటులైన మధురతర కవిత్వరచన మొనర్చి, రాజహృదయము చూరగొన దృఢసంకల్పుడయ్యెను. ఏవిధాననైన తనయభ్యున్నతికి వేపపురుగైన యువకుని తన పథమునుండి తొలగింపవలయునని గట్టి పట్టు పట్టినాడు. లేనిచో నాయువకుడు ప్రభుహృదయముపై నధికారము చలాయించినచో, రాజోద్యోగము నుండి తాను చేతులు కడిగికోవలసి వచ్చునని యాతని భయము.